# ది కేస్ ఆఫ్ ది మిస్సింగ్ బ్రెయిన్

'డిటెక్టివ్ గందరగోళం గారిల్లిదేనాండీ? అంటూ ఒక స్త్రీ నా ఆఫీస్ రూం గుమ్మం దగ్గరకు వచ్చింది.

ఆమె కంప్యూటర్ స్టేషనరీలా చాలా గ్లామరస్‌గా ఉంది. రిసెర్చి పేరుతో నెలల తరబడిగా క్లాసులు ఎగకొట్టిన మేష్టారిలా బెదురు చూపులు చూస్తోంది. తను కాపీ కొట్టదలచుకున్న అమెరికన్ పి.హెచ్‌డి థీసిస్‌ని మరెవరో అప్పటికే కాపీ కొట్టేశారని తెల్సుకున్న రిసెర్చి స్కాలర్‌లా ఆమె కొంచెం విచారంగా ఉంది. తన రిసెర్చి తనకి తప్ప మరెవరికీ పనికిరాదనే సత్యాన్ని గ్రహించిన సీనియర్ టీచర్‌లా ఆమె ఏదో మూగబాధను ప్రదర్శిస్తోంది.

"ఇల్లు కాదు ఆఫీస్. లోపలకు రండి" అంది నా సెక్రటరీ కె.డి. నిర్మలా లైలా.

లైలా ఆ స్త్రీని పరిశీలనగా చూసి, ఒళ్ళు తడిమి, ఆమె జాకెట్లోకాని, బొడ్లోకాని, హ్యాండ్ బాగ్‌లో కాని లైబ్రరీనించి ఎత్తుకొచ్చిన పుస్తకాలు, బాకులు, పిస్తోళ్ళు లాంటి ప్రమాదకరమైన వస్తువులేవీ లేవని రూఢి చేసుకుంది.

'ఏం లేవు బాస్' అంది లైలా.

"అయితే మనల్ని చంపడానికి రాలేదన్న మాట" అన్నాను నిరాశగా. ఎందుకంటే ఎన్ని ప్రమాదాల్లో ఇరుక్కుంటే అంత కీర్తి వస్తుంది. ఈ రహస్యాన్ని నేను ఇంజనీరింగ్ కాలేజీలో లెక్చరర్ ఉద్యోగం చేస్తున్నప్పుడే తెలుసుకొన్నాను. రోజూ లైబ్రరీకి వెళ్ళేవాడిని. రిఫరెన్స్ సెక్షన్‌లో గడిపేవాడ్ని. అక్కడున్నవన్నీ లావుపాటి వాల్యూములు. అంచేత నాక్కావలసిన రిసెర్చి వ్యాసాల్ని బ్లేడు సహాయంతో నేర్పుగా కట్ చేసి ఇంటికి తెచ్చుకునేవాడ్ని. ఈ లైబ్రరీల్లో న్యూసెన్సేమిటంటే ఎప్పుడూ చాలామంది ఉంటారక్కడ. ప్రశాంతంగా నాపని (బ్లేడ్‌తో కట్‌చేయడం) నేను చేసుకుందామంటే ఓ పట్టాన వీలుచిక్కేదికాదు. ప్రతిక్షణం ఎవరేనా నా పనిని గమనించి అడ్డుపడతారనే భయమే. ఆ ప్రమాదాల్ని ఎదుర్కొంటూ నేను ఎన్నో రిసెర్చి వ్యాసాల్ని కట్ చేసుకొచ్చి వాటిని తిరిగి నా భాషలో రాసి జర్నల్స్‌కి పంపేసరికి వాళ్ళు డంగై పోయి వెంటనే వేసేవారు. కాని ప్రిన్సిపాల్‌గారు నా కృషిని అపార్థం చేసుకుని నన్ను మర్యాదగా రిజైన్ చేసేయమన్నారు.

నేను విధిలేక రిజైన్‌చేసి డిటెక్టివ్ బోర్డు కట్టాను. దొంగ రిసెర్చి చేసినవాడిని కనుక దొంగల దొంగవేషాలన్నీ నాకు తెలుస్తాయి. (దొంగని దొంగే పట్టాలి అని సూక్తి) నేను

రెండేళ్ళలో డిటెక్టివ్‌లు "వాలి, "వేణు", "యుగంధర్", "నర్సన్" మొదలైన వాళ్ళని మించిపోయాను.

నేనలా మధుర స్మృతులలో మునిగివుండగా లైలా తన నోట్‌బుక్ నా ముందు పెట్టింది. ఆ స్త్రీ బయోడేటా: పేరు : ఓ.కే. నాగమణి. భర్తపేరు :ఓనా.ప్రవాసమూర్తి డి ఎస్.సి (ఆఫ్రికా)-యూనివర్శిటీ ప్రొఫెసరు; ఆమె వయస్సు : 35 సం||; ఎత్తు : 4 అ|| 10 అం||; బరువు : 45 కి||గ్రా||; చదువు: మెట్రిక్; వ్యసనాలు : హిందీ సినిమాలు; నగలు, చీరలు, భర్త రిసెర్చి గురించి గొప్పలు ....వగైరా.

ఆమెను పిలిచి విజిటర్స్ సోఫాలో కూర్చోబెట్టి "మీ సమస్య చెప్పండి" అన్నాను.

ఆమె కన్నీరు కారుస్తూ "మా యింట్లో నిన్నరాత్రి దొంగలు పడి మావారి రిసెర్చి రికార్డ్ అంతా ఎత్తుకు పోయారు. ఆయన గైడ్ చేసిన పి.హెచ్.డి.థీసిస్‌లు పదహారు, ఆయన వ్రాసిన రిసెర్చి పేపర్స్ మూడువందల తొంభై ఏడు, ఇంకా ... ఇంకా ..." అని నోరు పెగలక ఆగిపోయింది.

నేను ఓదార్పుగా "ఎరువు సొమ్ము బరువు చేటు అన్నారు. అవన్నీ కాపీ కొట్టి రాసినవే కదండీ, ఇపుడు బీరువా ఖాళీ అయింది. కనుక మళ్ళీ కొత్తవి రాసుకోవచ్చు. దానిలో శ్రమ అంతా టైపిస్టుదే కాని ఆయనకేం ఉండదు కదా" అన్నాను.

ఆమె సిగ్గుపడుతూ "అది కాదండి .... అంతే కాదండి ..." అని ఆగిపోయింది.

"ఫరవాలేదు చెప్పండి. ఇక్కడ మీరేం చెప్పినా, మూడోకంటి వాడికిచేరదు. రిసెర్చి పేపర్లలాగే, వాటిని రాసినవాడు, టైపిస్టు, ప్రింటుచేసే ప్రూఫ్ రీడరు తప్ప మరెవరూ చదవరు. అలాగే ఇక్కడి మాటలు మీకు, నాకు, లైలాకి తప్ప మరెవరికీ వెళ్ళవు, గో ఎ హెడ్!" అన్నాను.

ఆమె అతి కష్టంమీద "అవన్నీ కాకుండా దొంగలు మావారి శరీర భాగాన్నొక దాన్ని ఎత్తుకు పోయారండి. అది చాలా విలువైనది. అదిపోతే ఇక జీవితమంతా వ్యర్థమండీ," అని భోరున ఏడవ సాగింది.

నా క్లయింట్స్ చాలామంది ఏడుస్తారు. ఇంకెక్కడా నిజం చెప్పనివాళ్ళు నా దగ్గర నిజం చెప్పాల్సి వచ్చిందనేమో! వాళ్ళకోసం డజను కర్చీఫ్‌లు దాచి ఉంచుతాను. ఆ బొత్తిలోంచి ఒకటి తీసి ఆమె కిచ్చాను. ఆమె ఆ కర్చీఫ్‌ని బ్యాగ్‌లో దాచేసుకుని చీరకొంగుతో కళ్ళు తుడుచుకుంది.

నేను ఇలాంటి చిన్న కేసులు పట్టను. పెన్సిళ్ళు, పెన్నులు, సిగరెట్లు, రిసెర్చి పేపర్లు .... ఇలాంటి చవకబారు దొంగతనాలు రోజుకి లక్షన్నర. అంచేత నేనెప్పుడూ మర్డర్లు, దేశ ద్రోహులు, ప్రేమ నేరాలూ లాంటి వాటి పరిశోధనలనే టేకప్ చేస్తాను.

కాని ఈ కేస్‌లో ఒక గమ్మత్తు వుంది. పొ||ప్రవాసమూర్తి రిసెర్చి పేరుతో టన్నుల కొద్దీ కంప్యూటర్ స్టేషనరీ, ఇతర రకాల కాగితాలు వ్యర్థం చేస్తున్నాడు. ఆ కారణంగా కాగితం కరువు ఎక్కువై స్కూలు పిల్లలకి నోట్ బుక్కులు చాలినంతగా లభించడంలేదు. ఆ విధంగా దీన్ని దేశద్రోహం కేస్‌గా పరిగణించవచ్చు ననిపించింది నాకు.

అంతేకాదు. శ్రీమతి నాగమణి కథనం ప్రకారం దొంగలు ప్రొఫెసర్ గారి శరీరంలోని ఒక ముఖ్య అవయవాన్ని ఎత్తుకుపోయారు. అంచేత ఇది ప్రేమ కేసుకూడా కావచ్చు. ప్రియురాళ్ళు ప్రియుల హృదయాల్ని దొంగిలిస్తారు. (రిఫరెన్సులు : 1) "నన్ను దోచుకుందువటే వన్నెల దొరసానీ" 2) "ఏక్ పరదేశీ మేరా దిల్ లేగయా" 3) "ఖోగయా దిల్ మేరా సూకూ. సూకూ! మొ॥) తెలుగు, హిందీ సినిమాల్లో ఈ హృదయం లేక, దిల్ దొంగతనాలే ఎక్కువ.

ఇది పెద్ద కేసే. అథమ పక్షం పదివేలు కిడతాయని గ్రహించి, గంభీరంగా "ఓ,కే,మేడం! ఖర్చులకి ముందుగా ఓ మూడు రూపాయలు ఎడ్వాన్స్ ఇవ్వండి లైలా రిసీటిస్తుంది" అని పైప్ వెలిగించాను.

ఆ తర్వాత ముగ్గురం (లైలా డ్రైవింగ్) నా కారులో ప్రొఫెసర్ గారింటి కెళ్లాం.

ఆయన ఇంట్లో లేరు. అది కాలేజీ పనిచేసే సమయం కనుక క్లబ్బులో పేకాటకి వెళ్ళిపోయారు. అలాటి కఠోర నియమాలు, క్రమశిక్షణ లేకుండా గొప్ప సైంటిస్టుగా పేరు తెచ్చుకోలేం కదా !

ప్రొఫెసర్ గారి లైబ్రరీ అంతా చిందర వందరగా ఉంది. గది నిండా ఆయన నిత్యమూ అనుష్టించే డిటెక్టివ్ నవలలు, జోక్ బుక్సు, సిగరెట్ పెట్టెలు పడి ఉన్నాయి. దీపం వెలుగు తోంది. ఇదంతా క్షణంలో గ్రహించి 'రాసుకో లైలా ఆ దొంగ దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టేశాడు. అతనికి చీకటి అంటే భయమన్నా కావచ్చు, లేదా రేచీకటి జబ్బు కావచ్చు.... పాదాల గుర్తులు లేవు కనుక అతనికి పాదాలు లేవన్న మాట. అలాగే వేలి ముద్రలూ లేవు కనుక అతనికి వేళ్ళూ లేవు. తలా తోకాలేని రిసెర్చి వ్యాసాల్లాగే అతనెవరో చాలా గట్టివాడు. అంతర్జాతీయ ముఠా బాపతు కావచ్చు...' అని చెప్తుంటే, అదంతా పొట్టి చేత్తో (షార్ట్ హేండ్) రికార్డు చేస్తున్న లైలా ఆగి 'నాదో మనవి బాస్. దొంగ ఆడదేమో!'అంది.

'కారణం?' అన్నాను.

లైలా సెక్సీగా నా కళ్ళలోకి చూస్తూ "ఇవి కిరసనాయలు దొరకని రోజులు కదా" అంది.

"ఊఁ అయితే"

"ఇంకా తెలీలేదా బాస్. ఎలా తెలుస్తుంది లెండి. మగ మహారాజులు!" అని కళ్ళు వాల్చేసింది.

"నేను మగాణ్ణనీ భయపడకు, డియర్! గో ఎ హెడ్" అన్నాను. లైలా ధీమాగా నిలబడి "కిరసనాయలు లేనప్పుడు బొగ్గులో, కట్టెలో వాడుతాం వంటకి. ప్రొఫెసర్ గారి డిటెక్టివ్ నవలలు చిన్న సైజువి కనుక పొయ్యిలో పెడితే మహా అయితే ఒక పూటవంటకి సరిపోతాయి. పి.హెచ్.డి. థీసిస్‌లు అలాకాదు. ఒక్కొక్కటి ఆరుకేజీలైనా తూగుతుంది. దాంటో రాసిందంతా చెత్తే కనుక ఆ చెత్త బరువు మరో పది కేజీలు వేసుకోండి. వెరసి పదహారు కేజీల వంటచెరకు, దాని ఇంధనశక్తి బొగ్గు ఇంధన శక్తిలో సగం అనుకుంటే, ఒక్కొక్క థీసిస్సు 8 కేజీల బొగ్గులకి సమానం. ఆ లెక్కని పదహారు థీసిస్‌లూ పొయ్యిలో పెడితే అథమం వారం

రోజుల వంటకి-కుక్కర్ వాడితేనే సుమండీ-సరిపోతాయి ..." అని లెక్చరిస్తుంటే,

"తెలిసింది లైలా; తెలిసింది ! రిసెర్చికి ఇంత ప్రయోజనం ఉందని ఆడదానివి కనుక వెంటనే కనిపెట్టేశావు. మిగతాది నేనూహించగలను. విను ! రిసెర్చి పేపర్లలోది అంతా గ్యాసే కనుక అవి కాల్ గ్యాస్ పొయ్యికి పనికొస్తాయి. ప్రవాసమూర్తిగారి 397 పేపర్లూ కలిసి 12.5 కే. జీ. ల కాల్‌గ్యాస్ సిలిండర్‌కి సమానం. ఒక పరిమిత కుటుంబానికి నెల్లాళ్ళకి కావలసిన ఇంధన శక్తి ఆ పేపర్లలో ఉంటుంది. భలే థియరీ కనిపెట్టావు లైలా, నువ్వు జీనియస్‌వి" అన్నాను ఆరాధనా భావంతో.

"మీ జీనియస్ నాకంటుకుంది బాస్. లేపోతే నాలో ఏముందని? అంతా శూన్యం." అని కనురెప్పలు టపటప లాడించింది లైలా.

అంతలో నా ఎడం దవడ నరం బిగుసుకుంది. ఇదన్నమాట ఆ నేరస్థురాలి వ్యూహం. ఎంతస్వార్థం ! రిసెర్చి పేపర్లూ, థీసిస్సులు గృహిణులకు వంటచెరకుగా పనికి వస్తాయని తెలిసి కూడా ఆ విషయాన్ని ఏ సైన్సు పత్రికలోనో రాయకుండా దాచుకుంది. తెలివైన వాళ్ళు ఎంతసేపూ తమ లాభమే చూసుకొంటుంటే దేశం ఏం బాగుపడుతుంది. ఆమె నేరం క్షమార్హం కాదు. ఎక్కడ ఉన్నాసరే. ఆఖరికి వంటింట్లో దాక్కున్నా సరే ఆమెను పట్టేస్తాను. ఇదే నా ప్రతిజ్ఞ' అని గట్టిగా అరిచాను.

లైలా సన్నని గొంతుతో 'కాని బాస్! దొంగిలించబడిన ప్రొఫెసర్‌గారి అవయవం మాటో? మనం ఇప్పుడు అనుకున్న థియరీ ప్రకారం ఈ దొంగ ఒక ఆదర్శ గృహిణి. కిరసనాయిలు దొరక్క బెంగెట్టుకుని ఎలాగో అలాగ ఇంధనం సంపాదించి భర్తకీ, పిల్లలకీ; అన్నం వండి పెట్టాలనే ఆరాటంతో ప్రాణాలకు తెగించి దొంగతనానికి దిగిన వీరనారి అలాంటి పతివ్రత పరపురుషుని హృదయం - అందులోనూ రాతి గుండె అని పేరుపడిన ప్రవాసమూర్తిగారి హృదయం దొంగిలిస్తుందా? నేన్నమ్మను బాస్; నేన్నమ్మను!" అంది.

కథ అడ్డం తిరిగింది.

నేను లెక్చరర్‌గా ఉన్నప్పుడు ఓగొప్ప రిసెర్చి ఐడియా వచ్చింది నాకు. చాలా ఒరిజినల్ ఐడియా అని మురిసిపోయాను. అందరికీ చెప్పేశాను. మందుపార్టీలు ఇచ్చాను. తీరా లైబ్రరీకి వెళ్ళేసరికి నేను చేయాలనుకున్న రిసెర్చి 1904 లో జర్మనీలోనూ, 1907 లో రష్యాలోనూ ఎవరో చేసేశారని తెలిసింది. ముందు నిరుత్సాహపడినా వెంటనే తేరుకుని ఆ రిసెర్చి పేపర్లన్నిటిని బ్లేడ్‌తో కత్తిరించేసి, అవే నా పేరున సొంత పేపర్లలా టైప్ చేయించి పంపితే అవి పబ్లిష్ అయ్యాయి.

అలాంటి ప్రమాదాల్ని ఎదుర్కొన్న నాకే ఇప్పుడీ కథ అడ్డుతిరగడం గడ్డుసమస్యగా కనిపించిందంటే డిటెక్టివ్ వర్క్ ఎంత కష్టమో మీరు గ్రహించగలరు.

'లైలా! నాబుర్ర వేడెక్కి పోతోంది. నీ పైట చెంగుతో విసురు' అన్నాను కుర్చీలో కూలబడి.

లైలా కూర్చున్నది లేవకుండా కుస్ కుస్ మని నవ్వుకుంటోంది.

నేను క్షణంలో గ్రహించాను. లైలా ఆ రోజున చీరకట్టుకోలేదు !చేతుల్లేని జాకెట్టు, పొట్టి స్కర్టు ధరించింది. దేంతో విసురుతుంది నా వేడెక్కిన బుర్రని?

కొన్ని నిమిషాల్లో నా తలలోంచి పొగరావడం మొదలెట్టింది.

శ్రీమతి ప్రవాసమూర్తి లోపలకు పరుగెట్టుకెళ్ళి ఓ బకెట్ నీళ్ళు తెచ్చింది నా హెడ్ కూల్ చేయడానికి. కాని లైలా ఆమెను వారించింది. 'మిసెస్ నాగమణీ ప్రవాసమూర్తీ! డోన్టు వర్రీ. ఖేయాస్ (గందరగోళం) గారి బుర్ర మట్టితో తయారైంది. ఎంత వేడెక్కినా కరగదుగాక కరగదు, ఇన్ ఫాక్ట్ అలాంటపుడే ఆయనకు మంచి ఐడియాస్ వస్తాయి' అంది.

ఇద్దరు స్త్రీలూ భక్తిభావంతో విప్పారిన కళ్ళతో నా పొగలు చిమ్మే తలవైపు చూస్తూ నిలబడ్డారు.

నాకు క్లూ దొరికింది. దొరకడమేమిటి నేను ఒక్కసారి కుర్చీలోంచి ఎగిరి సీలింగ్‌ను ఢీకొట్టి మళ్లీ యథాస్థానంలో పడ్డాను. బకెట్ వైపు సాభిప్రాయంగా చూశాను. లైలా తన పొట్టి చేతుల్తో ఆ బకెట్ ఎత్తి నీళ్ళన్నీ నా నెత్తిన పోసింది. ప్రతి గొప్పవాడి వెనకాల ఒక స్త్రీ ఉంటుందనే సూక్తికి ఇంతకంటే ఋజువేం కావాలి?

బకెట్‌నీళ్ళూ నా నెత్తిన పడినా ఒక్క చుక్క కూడా కిందపడలేదు. (అంతా ఆవిరైపోయింది) దేశంలో ఏటా ఎన్నివేల రిసెర్చి పేపర్లు పబ్లిష్ అయినా ఒక్కటీ దేశప్రజల స్థాయికి దిగనట్లే!

నేను శ్రీమతి నాగమణివంక చూపుడువేలు డ్రమెటిక్‌గా ఆడిస్తూ 'ఎందుకండీ ఈ దాపరికం? దొంగతనంలో పోయింది మీవారి మెదడని ముందే చెప్పచ్చుగా!' అన్నాను తీవ్రంగా.

ఆమె సిగ్గుతో మెలికలు తిరిగిపోతూ 'ఆయన మెదడు లేకుండా క్లబ్ లో పేకాడుతున్నారనే రహస్యం బయటపడితే వాళ్ళాయన్ని ఎక్స్‌పెల్ చేయరా, గందరగోళంగారూ? అన్నీ తెలిసినవారు మీరే...మీరే...' అని రోదించసాగింది.

అదీ పాయింటే. మెదడు లేకుండా రిసెర్చి చేయవచ్చు. కాని క్లబ్ లో ఆ పప్పులుడకవు. అందరూ లోకువ కట్టేస్తారు.

'ఏడవకండమ్మా. మీవారి మెదడు తిరిగి మీకు అప్పగించే పూచీ నాది. ఆయన మెదడు వాడుకుని ఆయనలాగే గొప్ప రిసెర్చి చేయా లనుకుని ఉంటాడు దొంగ. క్లూ దొరికిందిగా, పట్టేస్తాను వాణ్ణి. కాని ఎంత దారుణం! సర్జరీలో వచ్చిన ట్రాన్స్ ప్లాంటేషన్ టెక్నిక్ దొంగలకు లాభదాయకం అవుతోంది. సైన్సు కూడా మతంలాగే దొంగవెధవల చేతుల్లో పడుతోంది. ఇది యుగధర్మం. వర్రీ అవకండి' అన్నాను.

రిసెర్చి స్కాలర్లు ఎవరేనా 'మెదడు మార్పిడి ఆపరేషన్ చేయించుకున్నారేమోనని ఆస్పత్రులన్నింట్లోనూ వాకబు చేయించాను. ఎవరూ లేరని తెలిసింది.

రెండు నెలలు గడిచాయి. ఈలోగా పొ॥ప్రవాస మూర్తి 66 రిసెర్చి పేపర్లు పబ్లిష్ చేశాడు. పేకాడుతూనే ఉన్నాడు.

అప్పుడు అనుకోకుండా ఓ క్లూ దొరికింది.

చాలా తెలివైన ఓ రిసెర్చి స్కాలర్ నరసింహం అనేవాడు - కొన్ని వారాల క్రితం పిచ్చాసుపత్రిలో చేరాడని.

ఆసుపత్రికి మారువేషంలో వెళ్ళి అతన్ని కలిశాను. సాటి పిచ్చివాడిగా అతను నన్నెంతో ఆదరించాడు. 'గురూజీ, మీకు పిచ్చాసుపత్రిలో ఎడ్మిషన్ ఎలా దొరికింది? లంచమా, రికమండేషనా?' అని రహస్యంగా అడిగాడు.

'రెండూ కాదు. ప్యూర్ మెరిట్' అన్నాను. 'మరి, నీ మాటో?'

'నాది స్వయంకృతాపరాథమండి., ప్రవాసమూర్తిగారు రిసెర్చి జీనియస్ కదా ఆయన రాసిన పేపర్లన్నీ చదివేస్తే నాకు రిసెర్చి పద్ధతి తెలుస్తుందనే పేరాశతో ఆయనింట్లో దొంగతనానికి దిగానండి. అంతవరకు దొంగతనంలో ఏమీ ప్రాక్టీస్ లేకపోయినా-'

'లేకేం? ఆళ్ళేళ్ళ నుంచి రిసెర్చి చేస్తున్నావుగా' అన్నాను.

అతను నా మాటల్ని జోక్ అని అపార్థం చేసుకుని రెండు నిమిషాలు తెగనవ్వి, 'అదీ ఓ విధంగా రైటేననుకోండి....దొంగతనం ప్రథమ ప్రయత్నం సక్సెస్ అయిందనే నిషాలో ఒళ్ళు మరిచి, కళ్ళు మూసుకుపోయి, చేయకూడని పొరపాటు చేశాను. ఖర్మ కాలితే తప్ప, అంతదారుణమైన తప్పు ఎవ్వరూ చెయ్యరు. పూర్వజన్మలో ఏ మహా పాపం చేశానో, ఫలితం అనుభవిస్తున్నాను' అన్నాడు.

'ఏం చేశావు? ఆయన మెదడుని డిస్ట్రాయి చేశావా?' అని ఆశగా అడిగాను.

'లేదండి. ఆయన రాసిన 397 పేపర్లు చదివానండి. దాంతో మతిపోయింది. మీకు తెలుసో లేదో రిసెర్చిలో ఓ నియమం ఉందండి. అదేమిటంటే ఎవరూ మరొకరు రాసిన రిసెర్చి పేపర్లు చదవ కూడదని....' ఆ నియమాన్నే ఉల్లంఘించానేన్నను. ఇదిగో ఫలితం' అని వెర్రిగా చూశాడు.

అప్పుడు నేను డిటెక్టివ్ ననే సత్యాన్ని అతనికి తెలియజేశాను. 'ఏం వర్రీ అవకు నరసింహం. నువ్వు త్వరలోనే కోలుకుంటావు. సైక్రియాట్రిస్టులు ఇచ్చే దారుణమైన మందుల దెబ్బనించి కూడా మనుషులు తేరుకుంటున్నారు. ఆ రిసెర్చి పేపర్ల ప్రభావం నుంచీ నువ్వు బయట పడతావు' అంటుంటే అతను కయ్యిమని లేచాడు." చెప్పారు లెండి. డిటెక్టివ్ అని గొప్పే కాని బుర్రలేదు!" అన్నాడు.

నేను వెంటనే మాట మార్చేస్తూ 'ఇంతకీ ప్రొఫెసర్‌గారి మెదడు ఏం చేశాడు?' అన్నాను.

అతను బాధగా 'నా మెదడు తీయించేసి, ఆయన మెదడు పెట్టించుకోవాలని ఆశ పడ్డానండి. ఇంతలోనే ఇక్కడ చేరాను' అన్నాడు.

'అది సరేగాని. ఆయన మెదడు తలలో ఉన్నది నీకెలా దొరికింది?'

"తలలో ఉంటె నేనెలా దొంగిలిస్తానండీ మీ పిచ్చిగాని. ప్రవాసమూర్తిగారు రిసెర్చికని టింబక్టూ వెళ్ళాక అది రిసెర్చికి అడ్డొస్తోందని దాన్ని తీసేసి, ఎవరో గొప్ప సైంటిస్టు మెదడుని

అమర్చారట అక్కడి వాళ్ళు. ఈయనేమో తన సొంత మెదడుని జాగ్రత్తగా ఓ పెద్ద సీసాలో దాచుకున్నాడు బీరువాలో పెట్టి. నా మెదడు కంటే మరేదైనా నయమేనని దాన్ని ఎత్తు కొచ్చాను. ఇప్పుడింక నా తక్షణ కర్తవ్యం మిమ్మల్ని చంపడమే!" అని నా మీకు దూకాడు నరసింహం. నేను నేర్పుగా పారిపోయాను...

టింబక్టూలోని నా ఏజెంట్‌కి ఈ కేస్ అంతా చెప్తూ ఉత్తరం రాశాను. దాని జవాబిది: టింబక్టూ వచ్చే నాటికి పో. నా. ప్రవాసమూర్తి చాలా చురుకుగా. తెలివిగా ఉండేవాడు. తన చదువు, రిసెర్చి దేశ సమస్యల పరిష్కారానికి తోడువడాలని అతని ఆశ. అది అతని రిసెర్చిగైడ్‌కి విడ్డూరంగా కనిపించింది. (ఇండియన్స్ ఏ రిసెర్చి చేసినా అది తెల్ల దొరలకి మాత్రమే లాభించాలి.) అంచేత మూర్తి మెదడు తీయించేశాడు. ఇంకెవరిదీ పెట్టలేదు.

(ఆంధ్రయూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజి మేగజైన్)

★